# శిక్ష

ఓ రోజు డ్యూటీ ప్రశాంతంగా గడిచిపోయిందనే సంతృప్తితో హాయిగా కాఫీ సిప్ చేస్తున్న బాయిలర్ ఇంజనీర్ రమేష్ స్టీమ్ ప్రెషర్ పడిపోవటం గమనించి, హడావుడిగా లేచాడు. బాయిలర్ వైపు పరిగెత్తాడు. బాయిలర్‌లో మంట బాగా తగ్గిపోయింది.

బాయిలర్‌కి ఇంధనమైన ఆయిల్ లెవల్ బాగానే ఉంది. మరి ఏమైనట్టు?

టాంకు నుంచి బాయిలర్‌కు వచ్చే లైన్‌ను అతి సూక్ష్మంగా పరీక్షిస్తూ నడవసాగాడు రమేష్. ఓ వాల్వ్ బాగా కారుతోంది. నేల అంతా ఆయిల్ వ్యాపించింది.

ఆ రోజు ఆయిల్ పంప్ అటెండర్ అప్పారావని గుర్తుకొచ్చింది. బ్రాకెట్టు చార్టు విప్పి ఎక్కడో కూర్చుని ఉంటాడు కాబోలు. రెడ్ హేండెడ్‌గా పట్టుకుని చెడామడా దులిపి ఛార్జి షీటు ఇప్పిస్తేనే గానీ బుద్ధి రాదతనికి అనుకున్నాడు రమేష్.

“అక్కడ కొంపలంటుకుపోతుంటే ఇక్కడ కూర్చుని నిద్రపోతున్నావా?” గట్టిగానే అడిగాడు రమేష్. “ఏం? ఆయిల్ లైన్‌లో వాల్వ్ కారుతుంటే వచ్చి చెప్పక్కరలేదా?”

“వాల్వ్ కారుతోందా అండీ? సారీ సార్! చూడలేదు.” గోడనానుకుని పరధ్యానంగా కూర్చున్న అప్పారావు లేచి మెల్లగా గొణిగాడు.

“నీ కేమీ కనిపించదు. అసలు పనిమీద దృష్టిఉంటే గదా కనిపించేది?” రమేష్‌కి కోపం వచ్చింది. “అయినా నిన్ను షిఫ్టులో భరిస్తున్ననాదే తప్పు అంతా. నీ కెన్నిసార్లు చెప్పాను అప్పారావ్ డ్యూటీలో బ్రాకెట్టు చార్టు విప్పవద్దని?”

“లేదు సార్! ఛార్టు చూడలేదు. నిన్నటి నుంచి బ్రాకెట్టు ఆడటం మానేశాను సార్!”

“మానేశావా? భలే జోక్ చెప్పావులే!”

"జోక్ కాదు సార్ నిజం!"

"నన్ను నమ్మమంటావా?"

"నిజం సార్, నిన్నటి నుంచి మానేశాను సార్"

"ఏమో! నేను నమ్మలేకపోతున్నాను అప్పారావ్, మహాభారతంలో శకుని పాచికలాట ఆడలేదని చెప్పినా నమ్ముతా నేమో గాని నువ్వు బ్రాకెట్టు ఆట మానేశాను అంటే నమ్మలేను."

అప్పారావుకి బాధ అనిపించలేదు. అతను బ్రాకెట్టు ఆట మానేశాడంటే ఎవరూ నమ్మరు. అతనికీ, బ్రాకెట్టు ఆటకీ ఉన్న సంబంధం అటువంటిది పుట్టి భూమ్మీద పడగానే అప్పారావు 'బ్రాకెట్ ... బ్రాకెట్' అని అరచాడని కొంతమంది ఎగతాళి చేస్తుంటే, మరి కొంతమంది అతను బ్రాకెట్టు చార్టు చంకలో పెట్టుకొనే పుట్టాడని అంటారు.

"ఇక్కడ పరధ్యానంగా కూర్చోకుండా బాయిలర్‌లో మంట జాగ్రత్తగా గమనిస్తూ కూర్చో, కావాలంటే ఆయిల్ ప్రెషర్ పెంచు. నేను వెళ్ళి మెకానిక్‌ని తీసుకొస్తా."

జీపు వేసుకొని వెళ్ళిపోయాడు రమేష్. మెల్లగా బాయిలర్ దగ్గరికి నడిచాడు అప్పారావు.

అప్పారావు పంప్ అటెండర్. సాధారణంగా కష్టపడి పనిచేస్తాడు గానీ, బ్రాకెట్టు చార్టు విప్పి కూర్చుంటే మాత్రం ఈ లోకాన్నే మరిచిపోతాడు. సాయంత్రం షిఫ్టులో ఎనిమిది గంట లవగానే బ్రాకెట్ చార్టు విప్పేస్తాడు. క్లోజింగ్ ఏ అంకెలో వస్తుందా అని అన్ని రకాల లెక్కలు వేస్తుంటాడు.ు. రాత్రి తొమ్మది గంటలు దాటినప్పటి నుంచీ అతనికి ఫోనుల మీద ఫోనులు వస్తూవుంటాయి. క్లోజింగ్ నెంబర్ గురించి. ఆరు నెలలు క్రితమే ఆ కంపెనీలో ఉద్యోగంలో చేరిన రమేష్‌కి భలే చికాకు వేసింది.

"ఏంటోయ్ అప్పారావ్! ఇన్ని ఫోన్ కాల్స్?" అడిగాడు రమేష్.

"అదేనండి, బ్రాకెట్ క్లోజింగ్ నెంబరు గురించి"

"బ్రాకెట్టా? అదేంటోయ్ అప్పారావ్?"

దొరికిన అవకాశం విడిచిపెట్టకుండా బ్రాకెట్టు ఆట మీద ఓ చిన్న లెక్చర్ ఇచ్చేశాడు అప్పారావు.

"అయితే రోజూ ఓ అయిదూ, పది రూపాయలదాకా ఆడతావా?"

"పదేంటండి బాబు ఇరవైకి తగ్గదు." దగ్గరలో ఉన్న ఆపరేటర్ అన్నాడు.

రమేష్ అప్పారావు వైపు ఆశ్చర్యంగా చూశాడు.

"అవును సార్! రోజూ కో ఇరవై రూపాయలకి ఆడటం మామూలే. ఒక్కొక్కరోజు నమ్మకాన్ని బట్టి ఎక్కువ ఆడినా ఆడతా"

అమ్మబాబోయ్! రోజుకి ఇరవై రూపాయలే? మతి పోయింది రమేష్‌కి. రోజుకి ఇంత డబ్బు బ్రాకెట్‌కే పోతే ఇతని ఇల్లెలా గడుస్తుందో? అదే మాట అడిగాడు అప్పారావుని.

"ఇల్లు గడవటమా? అదేం పెద్ద కష్టం కాదు అయ్యగారూ. మీ లాంటి వారి దయ ఉండగా మా కేంటి సార్?" తేలికగా నవ్వేశాడు అప్పారావు.

నలుగురు పిల్లల తండ్రి అప్పారావు. అప్పారావు అడిగినప్పుడల్లా సానుభూతితో వందో, ఏభయ్యో ఇస్తూండేవాడు రమేష్. చిన్నోడి కేదో జబ్బనో, పెద్దోడికి ఫీజు కట్టాలనో ఏవో కారణాలు చెప్పేవాడు. పుచ్చుకున్న డబ్బు జీతం అందగానే తిరిగి ఇచ్చేవాడు. అయిదారు రోజులు గడిచాక మళ్ళీ అడిగేవాడు. భార్యాబిడ్డల్ని బాధ్యతగానే చూసుకుంటున్నాడని అనుకునేవాడు రమేష్. కానీ అది నిజం కాదని తెలుసుకోవటానికి ఎక్కువ కాలం పట్టలేదు.

ఆ రోజు సెలవు గనుక మధ్యాహ్నం భోజనం చేసి పుస్తకం చదువుతూ పడుకున్నాడు రమేష్. ముందు గదిలోంచి అతని భార్య మాటలు వినిపించాయి.

"అయితే నన్నేం చేయమంటావ్ అప్పాయమ్మా?"

"అమ్మగారూ! మీ రెలాగన్నా అయ్యగారితో చెప్పి కొంత డబ్బు నాకు వచ్చేట్లు చూడండి. పిల్లలతో బ్రతకలేకపోతున్నాను."

"అలా గేలే, నువ్వు చెప్పిందంతా అయ్యగారితో చెప్తాను. అయినా అప్పారావు జీతం అంతా బ్రాకెట్లకు తగలేస్తుంటే నువ్వెందుకూరుకుంటున్నావ్?"

"ఊరుకోటంలేదమ్మగారూ. ఎన్నోసార్లు చెప్పి చూశాను. అలిగాను, అమ్మగారింటికి పోతానని బెదరించాను. అయినా లాభం లేకపోయిందమ్మగారూ!"

"మీ వాళ్ళని పిలిపించి మందలించలేకపోయావా?"

"అదీ అయిపోయం దమ్మగారూ. ఏవైనా వ్యసనాలు అలవాటు చేసుకోటం తేలికే గానీ మానటం కష్టం అమ్మగారూ!"

"సరేలే, అయ్యగారితో చెప్తాను."

"ఈ మధ్య బ్రాకెట్టు పిచ్చి ఎక్కువైపోయిందమ్మా. చేతిలో డబ్బుల్లేకపోతే పిల్లగాళ్ళకి జబ్బులనీ, ఆస్పత్రిలో చేర్చాలనీ అబద్ధాలు చెప్పి అప్పుచేస్తున్నాడట. చూడండమ్మా ఈ చంటివాడికి సరిగా పాలు లేకపోవటం వలన ఎలాగున్నాడో. ఈ మాత్రమైనా నేను నాలుగిళ్ళల్లో పాచిపని చేస్తున్నాను కనుక గడుస్తున్నాదండి." అప్పాయమ్మ తన దుఃఖమంతా ఒలకబోసింది. "ఈ మధ్య నా ఒంట్లో ఒకటే ఆయాసం, కడుపులో నొప్పి."

"సరేలే, అయ్యగారితో మాట్లాడతానన్నానుగా?"

"అన్నారండి. అప్పారావు మాయగాడమ్మగారూ? బ్రాకెట్టాటకి డబ్బులు లేనప్పుడు వచ్చి అబద్ధాలు చెపుతాడమ్మ. నమ్మి డబ్బులివ్వవద్దని చెప్పండి."

అప్పాయమ్మ వెళ్ళిపోయింది. అప్పారావుని ఒకసారి మందలించమని రమేష్‌కి చెప్పింది అతని భార్య.

బాయిలర్‌లో మంట బాగా తగ్గింది. లేచి వెళ్ళి ఆయిల్ పంపు చూడాలని అనుకున్నాడు గాని బద్ధకించి ఉండిపోయాడు అప్పారావు.

అతని మనసు ఏమీ బాగోలేదు. అప్పాయమ్మని మొన్ననే ఆస్పత్రిలో చేర్చాడు. ఆమెని తనిఖీ కోసం మద్రాసు తీసుకెళ్ళమన్నారు డాక్టర్లు. మద్రాసు వెళ్ళటం అంటే డబ్బుతో కూడిన పని. కనీసం

అయిదు వందలైనా ఉండాలి. ఆపరేషన్ చేయాలని చెపితే మరో రెండు మూడు వేలు కావాలి. చేతిలో ఉన్నదే కొద్దిపాటి డబ్బు. అది కాస్తా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చటానికి, డాక్టర్ల చేతులు తడపటానికే సరిపోలేదు.

ఆఫీసులో దొరికే అప్పు లేవీ మిగల్చలేదు అప్పారావు. అన్నీ వాడేశాడు. తోటి ఉద్యోగులు సర్దుతారేమో అన్న ఆశతో రోడ్డు మీద పడ్డాడు.

ముందు రమేష్ ఇంటికి వెళ్ళాడు. అన్నీవిన్న రమేష్ భార్యను పిలిచి రెండు వందలు తెమ్మన్నాడు. దాంతో మనసు కాస్త కుదుటపడింది. ఇంకో మూడు వందలు వెతికితే చాలు కదా అని.

డబ్బు తీసుకొచ్చిన రమేష్ భార్య అప్పారావుని చూసి ఆగిపోయింది. కోపంతో ఆమె మొహం ఎర్రబడింది.

"ఇతనికా డబ్బు?"

"అప్పారావుకి ఏదో అవసరం వచ్చిందట..." అన్నాడు రమేష్

"ఏం బ్రాకెట్టు ఆటకి డబ్బు కుదరలేదా? లేకపోతే మీరు కూడా బ్రాకెట్టు ఆట మొదలుపెట్టారా?"

"అతని భార్యకి సుస్తీ చేసిందట - మద్రాసు తీసుకెళ్ళాలట."

"అవన్నీ ఉత్తుత్త కబుర్లే నండీ. అప్పాయ్యమ్మ సంగతి నాకు తెలుసు. అంతగా అవసరం వస్తే ఆవిడే కబురు చేస్తుంది."

రమేష్ ఏమీ మాట్లాడలేకపోయాడు. డబ్బు వచ్చేది లేదని తెలుసుకున్న అప్పారావు అక్కడ నిలబడలేదు.

సింహాచలాన్ని అడిగితే ఇస్తాడేమో అని వాడింటికి వెళ్ళాడు. సింహాచలం కూడా పంప్ అటెండరే. డబ్బు వడ్డీకి ఇస్తూంటాడు.

డబ్బు లడగగానే గట్టిగా నవ్వాడు సింహాచలం. "అదేంటిరా ఇవాళ పెద్ద బ్రాకెట్టు కడతావా?"

బ్రాకెట్టు కోసం కాదనీ, తన భార్య ఆస్పత్రిలో ఉందని ఎంత బతిమాలినా నమ్మలేదు వాడు.

సింహాచలమే కాదు, అప్పారావు తోటి ఉద్యోగులెవ్వరూ కూడా నమ్మలేదు.

తిరిగి తిరిగి ఉత్త చేతులతో ఆస్పత్రికి చేరుకున్నాడు అప్పారావు. వాడికి చెప్పరానంత దుఃఖం వచ్చింది. బ్రాకెట్ ఆట ఇంత పని చేస్తుందని అతను అనుకోలేదు.

అప్పాయ్యమ్మ మంచం దగ్గర తలపట్టుకొని కూర్చున్నాడు. అతని కళ్ళ నుంచి కారిన కన్నీరు ఆవిడ మొహం మీద పడింది. కళ్ళు తెరిచింది అప్పాయ్యమ్మ

"ఎందు కేడుస్తున్నవ్ మావా? నాకేం పెద్ద జబ్బు లేదులే, నయమైపోతది."

ఏ మనాలో తోచలేదు అప్పారావుకి.

"నువ్వు అలా బాధ పడుతుంటే నేను చూడలేను మావా. ఇదిగో తీసుకో" మొలలోంచి ఒక రూపాయి బిళ్ళ తీసి అప్పారావుకిచ్చింది. "నా దగ్గర ఇదే ఉంది. వెళ్ళి 'క్లోజింగ్' కట్టు మావా! మనసు బాగుంటాది."

చెంపమీద కొట్టినట్లయింది అప్పారావుకి. కళ్ళు తుడుచుకున్నాడు. జేబు తడిమి చూశాడు. అప్పాయ్యమ్మ ఇచ్చిన రూపాయి బిళ్ళ భద్రంగా జేబులోనే ఉంది.

ఆ రూపాయి బిళ్ళతో బ్రాకెట్టు ఆడటానికి మనసొప్పలేదు. నిన్నటినుంచి బ్రాకెట్టు ఆడాలనిపించలేదు.

ఆయిల్ టాంకు దగ్గర పెద్ద మంట, వెలుగు కనిపించింది. పరుగెత్తాడు అప్పారావు.

నిప్పు ఆర్పటానికి ఫైర్ ట్రైలర్ సిద్ధం చేసి హోస్ లాక్కుంటూ ముందుకు నడిచాడు.

ఒక్క నిముషంలో ఆ ప్రాంతమంతా మంటలతో నిండిపోయింది. గంటసేపటికి అందరూ ప్రయత్నించి నిప్పుని ఆర్పగలిగారు.

గాయాలతో ఆస్పత్రిలో చేరిన అప్పారావును చూడటానికి మర్నాడు పొద్దుటే వెళ్ళాడు రమేష్. బాగా కాలిపోయిన అప్పారావును చూసి

రమేష్ కళ్ళలో నీళ్ళు నిండాయి.

"ఇప్పుడెలా ఉంది అప్పారావ్? కొంచెం బాగుందా? తొందరగానే కోలుకుంటావులే." సానుభూతితో పలకరించాడు.

"నాకే భయం, బాధ లేవు సార్. నేను బ్రతకనని నాకు తెలుసు." అదోలా నవ్వి అన్నాడు అప్పారావ్ "ఇది నేను నాకు వేసుకున్న శిక్ష సార్!"

అంటే ఏమిటి అప్పారావు ఉద్దేశం?

"అవును సార్! ఇన్నాళ్ళూ బ్రాకెట్ ఆటలో పడి నా బాధ్యతలను మరిచిపోయాను. దానికి శిక్ష ఇది." ఓ నిముషం, ఆగాడు అప్పారావు. అతనికి మాట్లాడటం కష్టంగా ఉంది. అతను బ్రతుకడేమోనని అనిపించింది రమేష్‌కి.

"మొన్నటి వరకూ నేను నా సరదా కోసం బ్రాకెట్ ఆడాను సార్. కానీ నిన్న నేను మా ఆవిడ గురించి ఆడాను."

అతని వైపు ఆశ్చర్యంగా చూశాడు రమేష్.

"నిన్న నిప్పంటుకున్నప్పుడు నా జీవితంతో ఆడాను సార్. ఇన్నేళ్ళుగా ఒక్కసారి కూడా రాని క్లోజింగ్ నెంబరు నిన్న వచ్చి తీరుతుందని నాకు తెలుసు."

ఏం చెప్పాలో తోచలేదు.

"మా ఆవిడను మద్రాసు తీసుకెళ్ళి వైద్యం చేయించాలి సార్! ఆవిడ లేకపోతే పిల్లలు బ్రతకలేరు." గొల్లు మని ఏడ్చాడు అప్పారావు. "ఏక్సిడెంట్‌లో చనిపోతే యాజమాన్యం వారు పెద్దమొత్తంలో నష్టపరిహారం ఇస్తారు కదా సార్!"

రమేష్ కళ్ళు తడిశాయి.

బహుశా అప్పారావు స్వయంగా వేసుకున్న ఈ శిక్షకు తనూ, తన తోటి ఉద్యోగస్తులే కారణ మేమోననే ఆలోచనతో నేరస్తుడిలా ఫీలయ్యాడు రమేష్.

* * *

(ఆంధ్రప్రభ వారపత్రిక 11-4-90 సంచికలో ప్రచురితం)